## 475 మంచి క్రైస్తవుల గుణములు

రా –ఆనందభైరవి (చాయ : వారు భాగ్యవంతులు) తా–అట

వారె మంచి క్రైస్తవులు గదా – యీ లోకమందు – వారె మంచి క్రైస్తవులు గదా చేరునట్లు చేయుడి. = పారమార్థమైన క్రీస్తు – సారవాక్య మనుభవించు – వారి దారి గోరి జేరి – భూరిసుఖముఁ బడయునట్టి ॥వారె మంచి॥

1. కపట వేష భాష లెల్లను – తొలంగఁ ద్రోచి – విపుల భక్తి నిపుణు లగుచును= లపితములు నసత్యములును – శపథములును లేక దేవ – కృప మనంబులోన వెలిగి – యుపరిభాగ మరయునట్టి ॥వారె మంచి॥
2. నమ్మకంబు సుస్థిరంబుగా – మనంబులోన – సమ్మతంబు గలిగి మెండుగా = క్రమ్ము కొనెడి శ్రమలయందు – సొమ్మసిలక ప్రభుని పా – దమ్ములందు బుద్ధి నిలిపి – నెమ్మది గలవార లెవరో ॥వారె మంచి॥

## 476 యేసు భాగ్యదాత

రా –రేగుప్తి తా–ఆది

యేసుని సేవింప దయచేసితివి – ప్రేమస్వరూప – యేసుని = దాసులనందరిని దరి జేర్చుటకును –వాసికెక్కి పరవాసము చేసెడి ॥యేసుని॥

1. ఆదియందు భూమ్యాకాశంబుల – శక్తి ఆత్మ నింపార సృజించిన ॥యేసుని॥
2. శత్రువులగు జనసంఖ్యను బొడగని – మిత్రుడగుచు దనమేను నొసంగిన ॥యేసుని॥
3. పాపులెల్ల దనప్రాపుగోరుకొని – దాపుగరండని దయచేఁ బిల్చెడి ॥యేసుని॥
4. సకల శుభంబులు చక్కఁగ నిచ్చుచు సకలభక్తులను సమముగఁ జూచెడి ॥యేసుని॥
5. తన్ను నమ్ముకొని యున్న దీనులకు – దన్నుగ[1] నుండెడి సన్నుతుడగుమా ॥యేసుని॥

[1]ప్రాపుగ.



6. చక్కని గుణములు లెక్కలేక తన – చక్కని యాత్మను చిక్కగఁబట్టిన ॥యేసుని॥
7. లోకమంతయును లోఁబడుచుండఁగ – నేక ప్రభువై యేలుచుండుమా ॥యేసుని॥

–పులిపాక జగన్నాథము

## 477 ఇహలోకము విశ్రాంతి లేనిది

రా –శుద్ధకాంభోజి (చాయ : విజయంబు విజయంబు) తా–కురుజంపె

ఏది నా విశ్రాంతి – యీ లోకమందు – నే దిక్కు గనుఁగొన్న – లేదు సుఖ మెందు = [1]మేదురా [2]మోద ని – [3]త్యోదగ్ర మోక్ష పుట – భేదమున చొరకున్న–లేదు సుఖ మెచట ॥నేది॥

1. కష్టములు తెరతెరలు – గా వచ్చిన మదాత్మ – దృష్టి దప్పక యోర్చి – తీరమంద వలయున్ = స్పష్టమగు నా త్రోవ – పయనంబు తుద ముట్ట – శ్రేష్ఠ మగు నా యిల్లు చేరు నందాక ॥నేది॥
2. కోరింద పొదచుట్టు – కొనియుండ నిమ్ము నేఁ – గోర నిచట గులాబి – కుసుమ శయనంబు = నేరీతినైన నా – యేసు రొమ్మునఁ జేరి – భూరిసుఖ మొందెద వి– చార మిఁక నేల ॥నేది॥
3. యేసుప్రియ మించు కే – నెఱిఁగి కన్గొను వేళ – నా సంతసము నిండు – పొసి చనె వెతలు = భాసురంబుగ మంచు – పగిదిఁ దళ తళలాడఁ – జేసె నా కన్నీళ్లు – చింత లెడఁబాపి ॥యేది॥
4. ఉండునే సందియము – లుండునే దుఃఖములు – గండములు ఢీయను చు బైకి రాఁ గలవే = మెండుగా మధురమై – యుండు మోక్షము నాకుఁ – దండ్రితో గడియ సే – పుండినను జాలు ॥నేది॥
5. నడుము పై నొక సంచి – బడెకట్ట చేతిలో – నిడికొనుచు శత్రువుల – పుడమి వే గడుతున్ = నడుదారి కరుకు నె – న్నక వేగ రక్షింపఁ – బదుదునని పాడి చని – పరమసుఖి నౌదు ॥నేది॥

– పురుషోత్తము చౌదరి

[1]దట్టమైన. [2]సంతోషముచేత. [3]గొప్పదియైన